ప్రజాశక్తి
శనివారం 13 ఏప్రిల్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఇంటర్ ఫలితాల్లో..

విశాఖ భళా.. అనకాపల్లి డీలా



ఉత్తమ ఫలితాలు సాధించిన బాసర కళాశాల విద్యార్థులు

- సప్లిమెంటరీకి 18 నుంచి అవకాశం
- ఫ్యాకల్టీ నియామకంలో ప్రభుత్వ తాత్సారంతో అనకాపల్లిలో పడిపోయిన ఉత్తీర్ణతా శాతం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఎంవిపి.కాలనీ విలేకరి

శుక్రవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాఖ మరోసారి మెరిసింది. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఈ జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. అదే సమయంలో అనకాపల్లి జిల్లా ఈసారి ఫలితాల్లో నిరాశే మిగిల్చింది. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 24, 25 స్థానాల్లో నిలిచి ఢీలా పడింది.

పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు, సప్లిమెంటరీ, రీ వాల్యుయేషన్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 18 నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. వారికి మే 24 నుంచి జూన్ 20 వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్ల డించారు.

విశాఖ జిల్లాకు నాలుగో స్థానం

ఇంటర్ ఫలితాలలో మొదటి సంవ త్సరంలో 77 శాతం, రెండో సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించి విశాఖపట్నం జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మొదటి సంవత్సరం పరీక్షకు 38,818 మంది విద్యార్థులు హాజరుకాగా 30,050 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా రెండో సంవత్సరానికిగాను 34,672 మందు విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 29,258 మంది ఉత్తీర్ణత సాధించారు.

2023లో మొదటి సంవత్సరంలో 63 శాతం, రెండో సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లా ఐదు, ఆరో స్థానాల్లో నిలిచింది. దాన్ని మెరుగుపరుచుకుని ఈసారి నాలుగో స్థానానికి ఎగబాకింది.

అనకాపల్లిలో నిరాశమిగిల్చిన ఫలితాలు

అనకాపల్లి జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు నిరాశను మిగిల్చాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఫలితాల్లో మెరుగ్గావున్నట్లు కనిపించినా, రాష్ట్ర స్థాయిలో చూసినప్పుడు జిల్లా 24, 25 స్థానాలకు దిగజారింది. గతేడాది మొదటి ఇంటర్ ఫలితాలు 35 శాతం వుండగా, ఈ ఏడాది ఆ ఫలితాలు 52 శాతానికి పెరిగాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫలితాలు మరింత తక్కువగా వున్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ మొదటి ఏడాదిలో 2,397 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 700 మంది (30 శాతం) పాసయ్యారు. రెండో సంవత్సరంలో పరీక్షలు రాసిన 2023 మందిలో 1070 మంది (53 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి ఏడాదిలో అతి తక్కువగా మిగతా 2లో..



ఆర్‌డిఒను అడ్డుకున్న గంగారావు, అదానీ గంగవరం పోర్టు కార్మికులు

అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన ఉధృతం

విధులు బహిష్కరించడంతో స్తంభించిన కార్యకలాపాలు

సమస్యలను పరిష్కరించాలంటూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు శుక్రవారం భారీ ఆందోళనకు దిగారు. రెండు రోజులుగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో శుక్రవారం వారంతా విధులను బహిష్కరించి గేటు వద్ద బైఠాయించారు. కార్గో హ్యాండ్లింగ్‌ను పూర్తిగా నిలిపేశారు. సుమారు 4000 మంది కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో పోర్టు స్తంభించింది. కార్మికులను ఉద్దేశించి గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు.
(ప్రధాన వార్త మెయిన్‌లో..)

మేలో పింఛన్ల పంపిణీ సజావుగా సాగేలా చూడండి

▶ వార్త 2లో..

కలగానే జల్లూరు వంతెన నిర్మాణం

▶ వార్త 7లో..

అవంతి కాలేజీ బస్సు బీభత్సం

▶ వార్త 5లో..

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఎంవిపి. కాలనీ : ఎన్నికల నిబంధనలను సక్రమంగా అనుసరించకపోయినా, ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని ఎన్నికల అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా విధులు కేటాయించిన పీవోలు, ఏపీవోలు తప్పకుండా బాధ్యతలను నిర్వర్తించాలని, తప్పించుకోవడానికి ప్రయత్నించవద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ సదస్సులకు హాజరుకావాలని, ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని, అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో పీవో, ఏపీవోల తొలి విడత శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ క్రమంలో విధులు కేటాయించిన సిబ్బందితో, అధికారులతో మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంవోటీలు శిక్షణ అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, శిక్షణ అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. విధులను అందరూ బాధ్యతగా నిర్వర్తించాలని, నిర్లిప్తత పనికిరాదని హెచ్చరించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అధికారులకు వారి మిగతా 2లో..

సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించండి



అభ్యర్థులు జగ్గునాయుడు, విమలతో నర్సింగరావు, పైడిరాజు, గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వచ్చే నెల 13న జరుగునున్న ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఎం అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు, విశాఖ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఐ అభ్యర్థిగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల పోటీచేస్తున్నట్లు సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజులు ప్రకటించారు. సిపిఎం, సిపిఐ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించి రాష్ట్ర అసెంబ్లీకి పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగదాంబ దరి సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర శాసన సభలో కమ్యూనిస్టులు లేకపోవడంతో కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, టిడిపి, వైసిపి రెండూ ఒకరిని ఒకరు తిట్టుకోవడానికి అసెంబ్లీని వేదికను ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీలు, ఆస్తిపన్ను, చెత్తపన్ను భారాలను వైసిపి ప్రభుత్వం మోపుతున్నా ప్రతిపక్ష పార్టీ తన పాత్ర ఎన్నడూ పోషించలేదన్నారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలకు ఎమ్మెల్యేలు లేకపోయినా ప్రజా సమస్యలను తీసుకొని ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం వామపక్షపార్టీలు నిఖరంగా నిలబడి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ భళా.. అనకాపల్లి డీలా

రాష్ట్రంలో జిల్లాలో బాలుర ఉత్తీర్ణత 39 శాతం నమోదైంది. రాష్ట్రంలో మొదటి సంవత్సరం ఫలితాల్లో జిల్లా స్థానం 24లో వుండగా, రెండో సంవత్సరంలో 25వ స్థానంలోకి దిగజారింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకంలో ప్రభుత్వం చేసిన ఆలస్యం పేద విద్యార్థుల ఫలితాలపై పడింది. జూన్‌లో తరగతులు ప్రారంభమైనా ఆగస్టు వరకు నియామకపు ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో తరగతులు ఆలస్యంగా ప్రారంభంకావడంతో ఆ ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణతపై పడింది.

ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 10,443 మంది పరీక్షలు రాయగా, 5,442 మంది (52 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాదిలో 9,248 మందికి 6,119 మంది (66 శాతం) పాసయ్యారు. జిల్లాలోని 20 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 619 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 452 మంది (73 శాతం), రెండో ఏడాదికిగాను 467 మంది పరీక్షలు రాయగా 388 మంది (79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. చీడికాడ కెజిబివిలో మొదటి ఏడాది ఎంఇసిలో 20 మంది పరీక్షలు రాయగా వీరిలో ఇద్దరు మాత్రమే పాసయ్యారు. కశింకోటలో పరీక్షలు రాసిన బైపిసి విద్యార్థులు 29 మంది (శత శాతం) ఉత్తీర్ణులయ్యారు. గొలుగొండ కెజిబివిలో రెండో ఏడాది పరీక్షలు రాసిన 34 మంది (శతశాతం) పాసయ్యారు.

సిపిఎం, సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

ఉద్యమిస్తున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేకమైన 2020 విద్యుత్ సవరణ చట్టం, కార్మిక లేబర్ కోడ్స్, పట్టణ సంస్కరణలను తీసుకురాగా రాష్ట్ర వైసిపి, టిడిపి ఎంపిలు పార్లమెంటులో మద్దతునిచ్చారన్నారు. రాష్ట్రానికి ద్రోహంచేసే బిజెపితో ప్రత్యక్షంగా టిడిపి, జనసేన, పరోక్షంగా వైసిపి మద్దతు ఇవ్వడాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండియా వేదికలో ఉన్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, జైభారత్ పార్టీలను కూడా బలపర్చాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అర్హతల మేరకు పీవో, ఏపీవో విధులు కేటాయించామని అందరూ తప్పకుండా హాజరై వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ సదస్సులకు సమయానికి విచ్చేసి అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఈవీఎంల వినియోగం, మాక్ పోలింగ్, ఇతర సాంకతిక అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా పీవో పాత్ర చాలా కీలకమని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే వారికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. అందరి సహకారంతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఓటింగ్ శాతాన్ని 75 నుంచి 80 శాతం వరకు పెంచేందుకు అందరూ తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొన్నారు.

ఓటు విలువ చాటుతాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దుబాయ్ నుంచి వచ్చి ఎపిలో జరగబోయే ఎన్నికల్లో ఓటు వేసి ఓటు విలువ తెలియజేస్తామని దుబాయ్ ఎన్ఆర్ఐ టిడిపి యుఎఇ అధ్యక్ష, కార్యదర్శులు మూతుకూరి విశ్వేశ్వరరావు (విస్సు), పొలిపిరెడ్డి వాసు (వాసు) తెలిపారు. నగరంలోని రాయల్ ఫోర్ట్ హోటల్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ దుబాయ్‌లో ఉగాది వేడుకలు ఘనంగా జరిపామన్నారు. టిడిపి జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరాం, ఇతర నాయకులు ధనుంజయ చౌదరి, అడుసుమిల్లి కృష్ణప్రియ, డాక్టర్ సందీప్ పంచకర్ల, జబర్దస్త్ ఫేం అదిరే అభి, కమెడియన్ కార్తీక్ తదితరులు హాజరయ్యారన్నారు.

మేలో పింఛన్ల పంపిణీ సజావుగా సాగేలా చూడండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సామాజిక పింఛన్ల పంపిణీలో ఏప్రిల్ నెలలో జరిగిన జాప్యం ఫలితంగా 65 లక్షల మంది పింఛనుదారులు పడ్డ తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల పింఛన్ల పంపిణీ సజావుగా సాగడానికి వీలుగా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ కోరింది. ఆ మేరకు సంస్థ ఉపాధ్యక్షులు, ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్వి.సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పూర్వ ప్రధానాధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ శుక్రవారం విశాఖలో కేంద్ర ఎన్నికల పరిశీలకులు రామమోహన్ మిశ్రాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత పారదర్శక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. భేటీ విషయాన్ని, ఆ సందర్భంగా తాము లేవనెత్తిన అంశాలను సంస్థ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ శుక్రవారం మీడియాకు వివరించారు. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చాక పంపిణీకి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

వైసిపిలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎంవివి.సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధి జివిఎంసి 19వ వార్డు పెదజాలరిపేట ప్రాంతానికి చెందిన 250 మంది శుక్రవారం వైసిపిలో చేరారు. వీరంతా టిడిపి, జనసేనలకు చెందిన వారని వైసిపి నేతలు తెలిపారు. లాసన్సబే కాలనీలోని వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో వైసిపి మత్స్యకార నాయకులు గంపల వెంకట రామచంద్రరావు సమక్షంలో ఈ చేరికలు సాగాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంవివి.సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ గోపాలపురం పరిశీలకులు గన్నమనేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పి.నారాయణ పాల్గొన్నారు. నియోజకవర్గంలో శుక్రవారమూ ఎంవివి పాదయాత్ర కొనసాగింది.

జివిఎల్‌కు ఎంపీ సీటు కేటాయించాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'కుటుంబ రాజకీయాలు నశించాలి - జివిఎల్‌కే విశాఖ ఎంపీ సీటు బిజెపి కేటాయించాలి, పురంధరేశ్వరి డౌన్ డౌన్ - జివిఎల్ జిందాబాద్' అంటూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. సమితి రాష్ట్ర కన్వీనర్ కె.వాసు మాట్లాడుతూ జివిఎల్‌ను పక్కన పెట్టి కులం కోసం, కుటుంబం కోసం కుట్ర చేసి పురంధరేశ్వరి విశాఖ ఎంపీ సీటును వేరొకరికి కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఎబివిపి పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిద్దలూరు విజయ్ కుమార్, జన జాగరణ సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

దక్షిణంలో అభ్యర్థుల ప్రచార హోరు

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు సి హార్స్ జంక్షన్ నుంచి శుక్రవారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ తన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు బుచ్చా రామిరెడ్డి, జనసేన అధ్యక్షులు లంకా త్రినాథ్, బిజెపి అధ్యక్షులు బి.చిన్నారావు పాల్గొన్నారు. 31వ వార్డు వైసిపి అధ్యక్షుడు బాపు ఆనంద్, జెసిఎస్ అధ్యక్షుడు రామానంద్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్నికల రోడ్ షో ప్రచారం జరిగింది. వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. డాబా గార్డెన్ సెంటర్ పాయింట్ హోటల్ నుండి లలితా కాలనీ, శెట్టి బలిజి సంఘం వీధి, గొల్లలపాలెం, ఆర్‌టి క్లబ్, ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, అంబేద్కర్ సర్కిల్, డాబా గార్డెన్స్ మెయిన్ రోడ్, సరస్వతి పార్క్, మాధవ స్ట్రీట్, తదితర ప్రాంతాల్లో ప్రచారం సాగింది.

జగనన్నా.. హామీలేమయ్యాయి.?

అక్కచెల్లెళ్లను నమ్మించి, నట్టేట ముంచావు...

మహిళా సంఘాల మండిపాటు



మాట్లాడుతున్న అత్తిలి విమల

ప్రజాశక్తి -ములగాడ : అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యనిషేధం అమలు చేస్తామని నమ్మబలికిన సిఎం జగన్, మాట తప్పడంతోపాటు రాష్ట్రాన్ని ఏకంగామద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని మహిళా సంఘాల నేతలు మండిపడ్డారు. శుక్రవారం సిపిఐ గ్రామమండలి కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యేగా ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ అభ్యర్థి అత్తిలి విమలకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి విమల, కాంగ్రెస్ నేత రజియాబేగం, ఐద్వా నేత పద్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి మాట్లాడుతూ, సంపూర్ణ మద్యనిషేధం అమలు, ఇతర హామీలు నెరవేర్చిన తర్వాత అక్కచెల్లెమ్మలకు ఓట్లు అడిగేందుకు వస్తానని ముఖ్యమంత్రి, ఇపుడు ఏముఖం పెట్టుకుని ఓట్ల కోసం వస్తున్నాయడని ఎద్దేవా చేశారు. వైసిపికి, టిడిపికి ఎవరికి ఓటేసినా బిజెపికే చేరుతుందని, బిజెపి మరోమారు అధికారం చేపడితే దేశం సర్వనాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా ఫోరం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఐద్వా నేతలు పద్మ, సత్యవతి, విమల మహిళా సమాఖ్య నేతలు జి జయ, దేవుడమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

18న 'గంటా' నామినేషన్ దాఖలు



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 18న భీమిలిలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కూటమి తరపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల్లో కీలకఘట్టమైన నామినేషన్ దాఖలు సందర్భంగా భారీ ఎత్తున జన సమీకరణ ఒడేలా ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు.ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టి, పోటీనుంచి తప్పుకునేలా ఈ ప్రక్రియ సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజబాబు, జనసేన నాయకులు ఇఎన్ఎస్ చంద్ర రావు, బిజెపి నాయకులు కె రామానాయుడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, వై అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు

ఘనంగా సఫ్దర్ హాష్మీ జయంతి



హాష్మీకి నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి నేతలు, చిన్నారులు.

ప్రజాశక్తి -కరాస: ప్రజా కళాకారుడు, ప్రజా కళారూపాల సృష్టికర్త, వీధి నాటిక వైతాళికుడు కామ్రేడ్ సఫ్దర్ హాష్మీ జయంతిని ప్రజానాట్యమండలి నగర కార్యాలయం హాష్మీ భవనంలో శుక్రవారం నిర్వహించారు. హాష్మీ చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నేత అరుణ్‌జీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాష్మీ గొప్పతనాన్ని చిన్నారులకు వివరించారు..పద్మ రాగిణి, విద్యార్థులు పాల్గొన్నారు

స్థానికేతరులకు ఓటుతో బుద్ధి చెప్పండి

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హాసిని వర్మరాజు



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వర్మరాజు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి ప్రాంత బాగోగులు పట్టించుకోని స్థానికేతరులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఇండియా ఫోరం తరపున పోటీచేస్తున్న భీమిలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజు (హాసినివర్మ) పిలుపునిచ్చారు. స్థానిక నాయకత్వం కోరుకుంటున్న భీమిలి ఓటర్లు, యువత, స్థానికుడినైన తనను గెలిపించాలని అభ్యర్థించారు. శుక్రవారం తాళ్లవలసలో మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఇండియా ఫోరంను గెలిపిస్తే ఏపికి ప్రత్యేకహోదా సాధ్యమన్నారు.జాతీయ సర్వేలన్నీ కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా ఫోరానికి అధికారం తథ్యమని స్పష్టం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన ఎవరికి ఓటేసినా బిజెపికి ఓటేసినట్లేనన్నారు. వైసిపి హయాంలోనే ఆరువేల మందికి ఉపాధినిచ్చే చిట్టివలస జ్యూట్‌మిల్లు మూతబడిందని, పర్యాటకాభివృద్ధి పై ఆయా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. పోటాపోటీ శిలాఫలకాలకే పరిమితమైన చిట్టివలస పెద్దచెరువు అభివృద్ధి ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, కాంగ్రెస్ నాయకులు గౌతమ్, మధుసూదనరావు, రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా జివిఎంసి మూడో వార్డుకు చెందిన 12మంది బిఎస్‌పి కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

'ఉత్తర'లో వైసిపి విస్తృత ప్రచారం



రాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సతీష్

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 46వ వార్డు మధుసూదననగర్‌లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో వైసిపి ఉత్తర ఎమ్మెల్యే కెకె.రాజు, విశాఖ ఎంపి బొత్స ఝాన్సీ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, బి.గోవింద్, కె చిన్న, జి.అప్పారావు, ఎన్.కృష్ణ కె.ఈశ్వరరావు, కె.లావణ్య, కె.రామారావు, ఎస్‌వి.రమణ, కె.శ్రీను, ఎస్. ఈశ్వరరావు, సీతయ్యరెడ్డి, దుర్గాభవాని, బాల, బొట్ట రాజు, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి, అన్నపూర్ణ, జగదీష్, దేవి, వరలక్ష్మి, విజయలక్ష్మి, కళావతి పాల్గొన్నారు

43వ వార్డులో ఎన్నికల ప్రచారం

జివిఎంసి 43వ వార్డు వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఉప్పశ్రీతో కలిసి వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు శుక్రవారం మార్నింగ్ వాక్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి సంక్షేమ పథకాలను వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో దువ్వపూడి శ్రీనివాస, గంగ మహేష్, బైరా వెంకట్, జె.సత్తి బాబు, ఠాగూర్, మహాద్వార గోపి, నేతల కుమార్, పద్మశేఖర్, ఎస్ నరసింగరావు, జగదీష్, సభి, తిరుపతిరావు, నరసయ్య, భీమా, బాధ శ్రీను, సూర్యారావు, ప్రసాద్, సింహాచలం, బంగారమ్మ, రమా, ఎం.రాణి, బి.గోవింద్, ఎం. సునీల్, అంబటి శైలేష్, భద్రి, జ్ఞానేష్ పాల్గొన్నారు.

వార్డు ఎన్నికల కార్యాలయం ప్రారంభం

53వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద స్థానిక కార్పొరేటర్ బర్కత్ ఆలీ ఆధ్వర్యంలో వార్డు ఎన్నికల కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రారంభించారు. సర్వ మత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిములు వైసిపిలో చేరారు. కార్యక్రమంలోఉత్తర నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, గుజ్జు వెంకటరెడ్డి, కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, కెవిఎన్ శశికళ, కృష్ణారావు మాస్టర్, అమర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం



వైసిపి కార్యాలయం ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి, పక్కనే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-మధురవాడ,: కారుషెడ్ కూడలి సమీపంలోవైసిపి భీమిలి నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారంఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ వైవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, గడచిన ఐదేళ్లలో కొంత అభివృద్ధి చేశానని, మరో అవకాశమిస్తూ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నగర మేయర్ హరి వెంకటకుమారి పాల్గొన్నారు.

ముమ్మురంగా వైసిపి ఎన్నికల ప్రచారం

ఆనందపురం: మండలంలోని మామిడిలోవలో వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం ఆధ్వర్యంలోఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సిఎం జగన్, వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీగా బొత్స ఝాన్సీలను గెలిపించాలని ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మామిడిలోవ పంచాయతీ అధ్యక్షులు బలిరెడ్డి మహేష్, సర్పంచులు గనిరెడ్డి శ్రీనివాస్, లంక రాంబాబు, ఎంపిటిసి డోలా .గౌతమి ఆనంద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రుషికొండ బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ బీచ్‌లో గురువారం గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం ఒడ్డుకు చేరిందని ఆరిలోవ పోలీసులు తెలిపారు. వివరాలివి. కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజ (20) గురువారం సాయంత్రం తన ఇంటర్ స్నేహితులు జి.సృజన్, జి.హర్ష, వంశీ, సాయి వెంకట్, ప్రణీత్‌లతో కలిసి రుషికొండ బీచ్‌కు వచ్చాడు. బీచ్‌లో సుమారు మూడు గంటల పాటు సరదాగా గడిపి, ఫొటోలు కూడా తీసుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఈ ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌కు కాస్త దూరం వెళ్లి స్నానాలకు దిగారు. ఈ క్రమంలో పెద్ద కెరటం ఒక్కసారిగా రావడంతో తేజ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించి, పెద్దగా కేకలు వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఘటనా స్థలానికి చేరుకుని గాలించినప్పటికీ తేజ ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. తేజ అమరావతి విట్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఇసిఇ అభ్యసిస్తున్నాడు. తండ్రి కెవిఎల్. యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేస్తు న్నారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాసురాజు రాజీనామా వెనక్కి..

ప్రజాశక్తి -భీమునిపట్నం: వైసిపికి భీమిలి ఎంపిపి దంతులూరి వెంకట శివసూర్య నారాయణరాజు (వాసురాజు) చేసిన రాజీనామాను వెనక్కు తీసుకుంటున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ,ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ ముఖ్య నేతలతో చర్చల తర్వాత, రాజీనామాను వెనక్కి తీసుకున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి, ఎంపీ ఝాన్సీరాణి విజయానికి కృషి చేస్తానన్నారు.

లక్ష్మీనారాయణ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- సీతమ్మధార: బడుగు బలహీన వర్గాల ప్రజలకు మంచి చేసే ఉద్దేశ్యంతోనే జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించినట్లు ఆ పార్టీ అధ్యక్షులు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు శుక్రవారం ఊర్వశి థియేటర్ పరిసర ప్రాంతంలో ఇంటింటికి వెళ్లిఎన్నికల ప్రచారం నిర్వహించారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు


క్షతగాత్రునికి మాజీ జెడి సపర్యలు

ఎన్నికల ప్రచారానికి కారులో వెళుతున్న లక్ష్మీనారాయణ, స్థానిక. జంక్షన్ వద్ద ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తికి సపర్యలు చేశారు. తీవ్రగాయాలతో క్షతగాత్రుడు స్పృహ కోల్పోకుండా స్వయంగా సేవలు చేశారు. లక్ష్మీనారాయణ సేవాభావం చూసి స్థానికులు కొనియాడారు.

మోసకారి వైసిపిని ప్రజలు నమ్మరు

-గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి -గాజువాక : ఐదేళ్ల పాలనలో ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన సిఎం జగన్, వైసిపి ప్రభుత్వం, అవినీతి సొమ్ముతో మరోమారు అందలం ఎక్కాలని చూస్తున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. శుక్రవారం గాజువాక టిడిపి కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని రూ.ఏడు లక్షల కోట్ల అప్పులతో ముంచేసి, రెండు లక్షల కోట్లకు పైగా ధనాన్ని దోచేసిన వైసిపి నేతలు, వాటితో ఓటర్లకు ఎర వేసి ఓట్లు గుంజేయాలని చూస్తున్నారని, వైసిపి మోసకారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈసందర్భంగా 18సంఘాల హమాలీలు పల్లాకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో పైలా దేవుడు. గొలగాని శీను, నందపల్లి దేవుడు. ఆటోనగర్ ఆనంద్, బర్నికం జగదీష్, చట్టి గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

పలుచోట్ల సిపిఎం అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సుత్తి, కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



రజకవృత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - గాజువాక : రజకుల వృత్తిదారుల సమస్యలపై సిపిఎం పోరాటం చేస్తుందని ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు భరోసానిచ్చారు. శుక్రవారం సాయి శంకర దుర్గాదేవి రజక సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, రజకుల వృత్తిదారులకు ఇళు ,, దోభీఘాట్లు, ఇతర సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిపిఎం అండగా నిలిచి పోరాటం చేస్తుందన్నారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ రజకుల ఇళ్లస్థలాల సమస్యలపై విభిన్న రూపాల్లో సిపిఎం పోరాటం చేస్తోందన్నారు .అందులో భాగంగా జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళనలు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి ఇంటి వద్ద ధర్నాలు, తాజా,మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పల్లా శ్రీనివాసరావులకు వినతిపత్రాలను అందజేసిన విషయం గుర్తు చేశారు. రజకుల సమస్యలపై అధికారంలో ఉన్న నేతలంతా నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఇండియా ఫోరం తరపున గాజువాక ఎమ్మెల్యేగా సిపిఎం అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కుంచాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం నేతలు ఎ.లోకేష్‌రాజు ఈశ్వరరావు పాల్గొన్నారు .

భెల్ గ్రౌండ్‌లో వాకర్స్‌తో ప్రచారం

కార్మికులు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఇండియా ఫోరం బలపరిచిన తనను గాజువాక ఎమ్మెల్యేగా గెలిపించాలని సిపిఎం అభ్యర్థి ఎం జగ్గునాయుడు కోరారు. శుక్రవారం ఉదయం భెల్ గ్రౌండ్‌లో వాకర్స్‌తో ముచ్చటిస్తూ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ఇంకా కార్మిక,ప్రజా సమస్యలపై అనేక పోరాటాల్లో పాల్గొన్నానన్నారు.

వాకర్స్ తో ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో లోకేష్, అప్పలరాజు, ఆంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు. భానోజీతోటలోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



భెల్ గ్రౌండ్‌లో ప్రచారంలో సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడు

గరిష్ట పెన్షన్ అమలుకు కుంటిసాకులు

• బిజెపి ప్రభుత్వంపై పెన్షనర్ల మండిపాటు



పెన్షనర్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

ప్రజాశక్తి -కరాస: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఇపిఎఫ్ పెన్షనర్లకు గరిష్ట పెన్షన్ అమలులో కుంటిసాకులు చెబుతూ తాత్సర్యం చేస్తున్నారని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఆప్రా) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మండిపడ్డారు. శుక్రవారం 52వ వార్డు శాంతినగర్ ప్రాప్తి భవనంలో నిర్వహించిన పెన్షనర్ల నెలవారీ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన హుస్సేన్ మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9వేలు అమలును కోరుతున్న సంఘాలన్నీ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటై కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కె సుధాకరరావు మాట్లాడుతూ కనీస పెన్షన్ అమలయ్యే వరకు ఎఐసిపి పిలుపుమేరకు పోరాటాలు చేద్దామన్నారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం చేసిన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో పెన్షనర్లంతా ఓటుతో బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్రభారతి యాజమాన్యం

రవీంద్రభారతి విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని వెల్లంకి రవీంద్రభారతి కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తా చాటారు.. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో జన్ని, లోకేష్ బాబు 464/470 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలవగా, ఏడుగురు గురు విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారు. సీనియర్‌ఇంటర్‌లో పిల్ల. స్వప్న 981 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ప్రతిభ చూపిన విద్యార్థులను కాలేజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, జోన్ ఇన్‌ఛార్జి వెంకటేష్, సిజిఎం వసుధ, ప్రిన్సిపల్ పవన్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల ప్రతిభ

సీతమ్మధార:ఇంటర్ ఫలితాల్లో బుల్లయ్య కాలేజీ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని కాలేజీ కరెస్పాండెంట్ జి మధుకుమార్ తెలిపారు. కాలేజీ నుంచి 765మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా, ఫస్టియర్‌లో 46.49శాతం, సెకెండియర్‌లో 61.49 శాతంఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

బాసర విద్యార్థుల ప్రభంజనం

తగరపువలస : ంటర్ ఫలితాల్లో స్థానిక బాసర జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ పూడిరమేష్, ప్రిన్సిపల్ వివిడి రమేష్ తెలిపారు.ఇంటర్ ఫస్టియర్ ఎంపిసిలో కె.అలేఖ్య, పి.ఝాన్సీ (465/470), కె.మోహన్ 464, బి.లాస్య 463, బైపిసిలో కె ధనలక్ష్మి 433, కె దివ్య 432 మార్కులు సాధించారన్నారు. ఎంపిసిలో 460 పైగా మార్కులు 9మంది, బైపిసిలో 430కి పైగా ముగ్గురు మార్కులు సాధించారన్నారు

సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎం.శ్రావణి (988/1000), పి వెంకటలక్ష్మి 987, బైపిసిలో బిఎస్‌కె తేజస్విని 978, ఎల్ తనోజ్ కుమార్ 976 మార్కులు సాధించారన్నారు. 980 మార్కులుపైబడి_న 8 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

సత్తా చాటిన 'శశి' విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యాసంస్థ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచినట్లు సంగివలస శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 520మందికి గాను 519 మంది (99.8 శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 985పైన మార్కులు సాధించిన వారిలో 25 మంది, 980పైన 64మంది, 950పైన 267 మంది, 900 పైన 409 మంది, మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపిసిలో 119 మందికి 119 మంది (100 శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 705 మందికి గాను 698 మంది (99 శాతం)ఉత్తీర్ణత సాధించారన్నారు. సత్తా చాటిన విద్యార్థులను శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గతేడాది కంటేమెరుగైన ఫలితాలు సాధించారు. సెకెండ్ ఇంటర్‌లో గతేడాది 38శాతం ఉత్తీర్ణత రాగా, ఈ ఏడాది 44.4 శాతం ఫలితాలు వచ్చాయి. బైపిసిలో జి.ఏకేశ్వరి నాయుడమ్మ 951/1000 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ సూర్య ప్రసాద్ తెలిపారు. ఎంపిసిలో ఎస్ కిరణ్మయి 906 మార్కులు, సిఇసిలో ఎం.శంకర్ 850 మార్కులు, హెచ్ఇసిలో ఎవై అప్పన్న 928 మార్కులు సాధించారని తెలిపారు



ఏకేశ్వరి నాయుడమ్మ

ఇంటర్ మొదటి ఏడాది ఫలితాల్లో బైపిసి విద్యార్థి వై అనిత 430/440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు

ఇంటర్ ఫస్ట్ ఇయర్ జనరల్‌లో 149 మందికి 43 మంది విద్యార్థులు పాసై 28.86శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ జనరల్ 117మందికి 52 మంది పాసై 44.44శాతం, వృత్తి విద్యా కోర్సుల్లో ఫస్ట్ ఇయర్‌లో 210మందికి 109 మంది (54.23 శాతం), సెకండియర్‌లో 158 మందికి గాను 136 మంది (86.06 శాతం) ఉత్తీర్ణత సాధించిన ట్లు ప్రిన్సిపల్ తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఎఅండ్‌టిలో కె.సంధ్యకు 950 మార్కులు, ఒఎస్‌లో ఎన్ వాసవికి 900 మార్కులు, ఇటిలో బి వినయ్ కుమార్ 937, సిఎస్ఇలో వి శ్యామల 819, ఎంఎల్‌టిలో వి సతీష్ 935, ఎంపిహెచ్‌డబ్ల్యూలో బి హేమ లత 955 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు

కెజిబివి విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం : ఇంటర్ ఫలితాల్లో స్థానిక కెజిబివి విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో నీటిపల్లి కావ్య 964/1000 మార్కులు సాధించగా, ఫస్టియర్ బైపిసి విద్యార్థిని బి వెంకటలక్ష్మి 419 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ గంగాకుమారితోపాటు సమగ్రశిక్ష ఎపిసి శ్రీనివాస్, జిసిడిఒ ఖలీషాబేగం అభినందించారు.



నీటిపల్లి కావ్య



వెంకటలక్ష్మి

ఎసెంట్ విద్యార్థుల ప్రతిభ



జె.సిద్ధార్థ రెడ్డి



బి.హర్షదీప్



అర్జి జిషిత

విశాఖ కలెక్టరేట్ : ఇంటర్ ఫలితాల్లో నగరంలోని ఎసెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపిసి గ్రూప్‌లో 94.6 శాతం, ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూప్‌లో 98.3 శాతం, బైపిసి గ్రూప్‌లో 100 శాతం అసెంట్ విద్యార్థులు ఉత్తీర్ణతా శాతం నమోదు చేశారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో జామి సిద్ధార్ద్ రెడ్డి 466/470, ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో బొతిపి హర్షదీప్ 989/1000, బైపిసిలో అర్జి జిషిత 983/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో 825 మంది ప్రథమ సంవత్సరం ఎంపిసి విద్యార్థులకుగాను 148 మంది 95 శాతంకుపైగా స్కోర్, 310 మంది 90 శాతంపైగా స్కోర్ సాధించారని, మొత్తంగా 575 మంది విద్యార్థులు ఎ గ్రేడ్ మార్కులను సాధించారని తెలిపారు.

అలాగే 778 మంది ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూప్ విద్యార్థులకుగాను 14 మంది విద్యార్థులు 98 శాతంపైగా స్కోర్, 119 మంది విద్యార్థులు 95 శాతం పైగా స్కోర్, 300 మంది విద్యార్థులు 90 శాతంపైగా స్కోర్ సాధించారన్నారు. మొత్తంగా 621 మంది విద్యార్థులు ఎ గ్రేడ్ మార్కులను సాధించినట్లు తెలిపారు. బైపిసిలోనూ మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఫలితాల సాధనకు దోహదపడ్డ అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్స్ బి.శ్రీనివాసరావు, ఎమ్.గౌరినాయుడు మెచ్చుకున్నారు.

శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులంలో 71.69 శాతం ఉత్తీర్ణత

ఆరిలోవ : కేంద్రకారాగారం వద్ద గల శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో 71.69 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. మొదటి ఏడాది ఇంటర్ ఎంపిసిలో 65.51 శాతం, బైపిసిలో 69.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపిసిలో టి.రాజేష్ అత్యధికంగా 441 మార్కులు సాధించగా, బైపిసిలో విశాల్ రాజ్ 416 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 84.37 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఎంపిసిలో అత్యధికంగా 933 మార్కులు సాధించగా, బైపిసిలో బి.ప్రవీణ్ అత్యధికంగా 738 మార్కులు సాధించాడు.

సత్తా చాటిన విశ్వ కాలేజీ విద్యార్థులు



గునిశెట్టి వినయ్

సీతమ్మధార: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు మంచి మార్కులతో సత్తా చాటారని కళాశాల చైర్మన్ ధర్మరాజు తెలిపారు, ఇంటర్ ఫస్టియర్ ఎంపిసిలో 460పైగా మార్కులు 84 మంది, 450 పైగా మార్కులు 296 మంది విద్యార్థులు సాధించారన్నారు. సెకెండియర్‌లో 980 పైగా మార్కులు 22 మంది, 970పైగా మార్కులు 80 మంది సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు కాలేజీ డైరెక్టర్ పి సూర్యనారాయణ తల్లిదండ్రులు ఉన్నారు.



దంగేటి పల్లవి



గూడె ఆదిశేషు

అవంతి కాలేజీ బస్సు బీభత్సం

- మొబైల్ టిఫిన్ వ్యాన్‌ను ఢీకొన్న వైనం
- బాలుడు దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు
- ద్విచక్ర వాహనాలు నుజ్జు నుజ్జు

ప్రజాశక్తి- కశింకోట

కసింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారి హెరిటేజ్ ఫ్యాక్టరీ దగ్గరలో అవంతి ఇంజనీరింగ్ కాలేజీ బస్సు శుక్రవారం బీభత్సం సృష్టించింది. విశాఖపట్నం నుండి మాకవరపాలెం వద్ద ఉన్న అవంతి కాలేజీకి వెళ్తున్న కళాశాల బస్సు బయ్యవరం జాతీయ రహదారి హెరిటేజ్ ఫ్యాక్టరీ దగ్గరలో రోడ్డు పక్కన ఉన్న మొబైల్ టిఫిన్ వ్యాన్‌పై దూసుకొచ్చింది. అనంతరం అక్కడే ఉన్న కారు, ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో మొబైల్ వ్యాన్ వద్ద టిఫిన్ చేస్తున్న ఐదుగురు యువకుల బైకులు నుజ్జునుజ్జు అయ్యాయి. పెందుర్తి నుండి పిఠాపురం తమ స్వగ్రామం వెళ్తూ మొబైల్ టిఫిన్ వ్యాన్ వద్ద ఆగి టిఫిన్ చేస్తున్న బాలుడు గౌస్ (12)ను ఢీకొట్టడంతో ఆ బాలుడు టైర్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. టిఫిన్ వ్యాన్ యజమాని బయ్యవరం గ్రామానికి చెందిన గొల్లవిల్లి గోవింద, గొల్లవిల్లి రమణమ్మ, గున్నబత్తు లక్ష్మీ మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనకాపల్లి వంద పడకల హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్ తరలించారు. కొందరు అనకాపల్లి ఉషా ప్రేమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాలేజీ బస్సు డ్రైవర్ కాండ్రేగులు ఉషా కిరణ్ పరారీలో ఉన్నాడు. ప్రమాద స్థలానికి సిఐ వినోద్ బాబు తన సిబ్బందితో వచ్చి గాయపడ్డ వారిని హాస్పిటల్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అవంతి బస్సు ఢీకొట్టడంతో నుజ్జు అయిన మొబైల్ టిఫిన్ వ్యాన్, ద్విచక్ర వాహనాలు

సంఘటనా స్థలంలో గౌస్ మృతదేహం

క్షతగాత్రులకు పలువురు పరామర్శ

అనకాపల్లి ఉషా ప్రేమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్ కుమార్, జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలను కోరారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు సిరిపురం సమీపంలోని శ్రీలక్ష్మీ గణపతి గుడి వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు ద్విచక్ర వాహనం నడుపుతున్న రాజ్‌కుమార్ (30)పై నుంచి వెళ్లడంతో ఆయన మృతిచెందాడు. మృతునిది విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణరాజాపురం గ్రామం. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ ఎడిసిపి ఆర్.శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్, క్లీనర్‌ను ట్రాఫిక్ సిఐ అమ్మినాయుడు అదుపులో తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న భరత్‌కుమార్

ఉపాధి హామీ కూలీలను కలిసిన భరత్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ శుక్రవారం అనకాపల్లి మండలం, గొలగాం పంచాయతీ, ఎల్లారమ్మ కాలనీ, గొలగాం కాలనీ, శంకరం గ్రామం, బట్లపూడి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి తిరిగి వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వైస్ బోర్డు ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్ల సూరిబాబు, గొలగం సర్పంచ్ చలపారెడ్డి నాగ నర్సింగరావు, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మీ రామకృష్ణ, బట్లలపూడి సర్పంచ్ గొంతిన సజావతి, వైసిపి నాయకులు నోట్ల శ్రీనివాసరావు, మింది అచ్యుత్, పిల్లల నాగేశ్వరరావు, బొడ్డేడ రామచంద్రరావు, చందక నాగేశ్వరరావు, చూడు చంద్రమోహన్, పొలమరిశెట్టి గంగాధర్, చందన సూరేష్, ఎంపీటీసీ మంత్రి సత్తిబాబు, వైస్ సర్పంచ్ గుడాల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి- అనకాపల్లి

డబల్ ఎంట్రీ ఓట్లు, డెత్ ఓట్లుపై తెలుగుదేశం జనసేన నాయకులు ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేయడం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథ్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఎనిమిది మాసాలుగా ఈవీఎంలు వెరిఫికేషన్ మొదలుకొని ఓటర్ లిస్ట్ దగ్గర నుండి అన్ని రాజకీయ ప్రధాన పార్టీలను రాజకీయ పార్టీల అనుమతితో బిఎల్ఎలను నియమించడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. బిఎల్ఓ ఆధ్వర్యంలో ఇంటింటి ఓటర్ సర్వే చేయడం సర్వేలో ఏమైనా లోపాలు ఉంటే అధికార యంత్రాంగం పరిష్కరించడం జరిగిందని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదులైన పరిష్కారం చేస్తామని జిల్లా కలెక్టర్ తెలియజేశారన్నారు. ఓటర్ లిస్ట్‌పై అవగాహన లేకుండా మరణించిన వారి ఓట్లు డెత్ సర్టిఫికెట్ ఉండాలి లేదా కుటుంబ యజమాని అనుమతితో స్థానిక పెద్దలు మరణించిన వ్యక్తిపై పంచాయతీ తీర్మానం చేయాలన్నారు.

305 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం జరిగింది. ఈ శిబిరంలో 305 రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 16 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, జమిన్ జబ్, రోగులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బిజెపి ప్రచార రథం

ప్రజాశక్తి-మునగపాక

మండల కేంద్రం మునగపాకలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి ప్రచార రథాన్ని ఎలక్షన్స్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని తమ అధీనంలో తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై ప్రసాదరావు తెలిపారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో బిజెపి ప్రచార రథం



గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న కొణతాల రామకృష్ణ తదితరులు

ఎల్లయ్య కాలువ గ్రోయిన్ పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే శిధిలావస్థలో ఉన్న శారదా నది పరివాహ ప్రాంతంలో బ్రిటీష్ వారి హయాంలో నిర్మించిన సుమారు 11 ఆనకట్టలకు తక్షణమే మరమ్మతులు చేస్తామని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎల్లయ్య గ్రోయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లయ్య ఆనకట్ట సుమారు 5 మండలాలకు సంబంధించి 20 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఈ ఆనకట్టకి మరమ్మతులు చేయలేదన్నారు. రాజశేఖర్ రెడ్డి రైతులు పక్షపాతిగా ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటికీ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారని గుర్తు చేశారు. తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పినట్లు ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రుత్విక్, బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావు , బొడ్డపాటి రాంకుమార్, కర్రి బాబీ, పీలా విశ్వేశ్వరరావు, రాపేటి రాంకుమార్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మర్రివలసలో ప్రచారం

ప్రజాశక్తి- కె.కోటపాడు

టిడిపి, బిజెపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండల బిజెపి అధ్యక్షులు కొటాన ఈశ్వరరావు ఆధ్వర్యాన మండలంలోని మర్రివలస, శృంగవరం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బండారు సత్యనారాయణ పాత్రుడు, సబ్బవరపు శివ దొంగ రమణ, ఇమంది సన్యాసిరావు, నారెం తాతబాబు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమావేశం

శాంతియుత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఆరిలోవ

జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. శుక్రవారం చినగదిలి రూరల్ తహసిల్దార్ కార్యాలయంలో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఎన్నికల కోడ్ అమలు, కొత్త ఓటర్ల నమోదు, ప్రచార ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కోడ్ అమలుకు అందరూ సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయవచ్చని సూచించారు.

గ్రామ వాలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలు చూపుతున్న వాలంటీర్లు

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూనే ఉంది. మండలంలోని శిరసపల్లి, తోటాడ, వెంకటాపురం, గంగాదేవి పేట గ్రామాలకు చెందిన 80 మంది వాలంటీర్లు శుక్రవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో మన్మధరావుకు అందజేశారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వాలంటీర్లు, వాలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి నిరసనగా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు వాలంటీర్లు పేర్కొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొంకసింగి గ్రామానికి చెందిన తొమ్మిది మంది వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు పంచాయతీ కార్యాలయంలో రాజీనామా లేఖలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రతిపక్షాలు తమను ప్రజాసేవ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. దీంతో తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఇవిఎం, వివి ప్యాడ్‌ల ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రధాన ఓటర్ల నమోదు అధికారి ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వి.వి.ప్యాడ్‌ల మొదటి ర్యాండనైజేషన్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన జాతీయ నాలుగు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రవి పట్టణన్ శెట్టి తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వివి ప్యాడ్లు కేటాయించినట్లు చెప్పారు. కేటాయింపు చేయబడిన వివి ప్యాడ్ లు అన్నింటికీ స్కానింగ్ చేసి సదరు ఈవీఎంలను జిపిఎస్ ట్రాకింగ్ కలిగిన వాహనాల్లో తగిన భద్రత ద్వారా అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కేంద్రాలకు అక్కడి స్ట్రాంగ్ రూములకు తరలించడం జరిగిందని చెప్పారు. ఈ ర్యాండ్ మైజేషన్ ప్రక్రియలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి దయానిధి, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు ఏ చిన్నికృష్ణ, హెచ్‌వి జయరాం, కె.గీతాంజలి, జీ.వి.సత్యవాణి, కే.మనోరమ, రాజకీయ పార్టీల ప్రతినిధులు కే హరినాథ బాబు (ఆప్), బి శ్రీనివాసరావు (తెలుగుదేశం), పి నాగేశ్వరరావు (బిజెపి) శంకరరావు(సిపిఎం) తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



రోడ్ షోలో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి ఆనంద్‌కుమార్

వెంకటాపురంలో వైసిపి రోడ్‌షో

ప్రజాశక్తి-గోపాలపట్నం : వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా జివిఎంసి 92వ వార్డు వెంకటాపురంలో కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకటాపురంలో ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం రోడ్డు షో నిర్వహించారు. ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్‌కె. రెహమాన్, గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామి నాయుడు,పాల్గొన్నారు.



లైన్స్ క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

జన్నవరం జెడ్‌పి హైస్కూల్‌కు లయన్స్‌క్లబ్ వితరణ

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం మండలం జన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నం లైన్స్ క్లబ్ వారు రూ.50,000 విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, రూ.20,000 విలువ గల సైకిళ్లు, స్పోర్ట్స్ మెటీరియల్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, అశోక్ అగర్వాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివికె. పద్మావతి, గ్రామ సర్పంచ్ కోసం సన్యాసిరావు, పాఠశాల చైర్మన్ మరిసా ఈశ్వరమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఇజెడ్ కాలనీలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం ఎస్ఇజెడ్ కాలనీలో శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ఇంటింటి ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు అవుతాయని చెప్పారు. ఎన్నికలలో ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బూడి ముత్యాల నాయుడు, తనను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ప్రత్యేక పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- కె.కోటపాడు

చూడి నిలవని పాడిపశువులకు ప్రత్యేక వైద్య పశు శిబిరాలు ఉత్తరాంధ్ర అంతటా నిర్వహిస్తామని విశాఖ డెయిరీ జిఎం ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని చౌడువాడ గ్రామంలోని విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద చూడి నిలవని పాడిపశువులకు వైద్య శిబిరం నిర్వహించారు. 64 పశువులకు విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ ఏజీఎం డాక్టర్ పాండ్యరాజన్, డాక్టర్ హరినారాయణ, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సొసైటీ అధ్యక్షులు కొమార వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఎర్రి నాయుడు, నాగ అప్పారావు పాల్గొన్నారు



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యులు

రైవాడ ప్రాజెక్టుపై ప్రైవేటు వ్యాపారుల పెత్తనం

- మత్స్యకారుల శ్రమను దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

రైవాడ ప్రాజెక్టుపై ప్రైవేటు వ్యాపారుల పెత్తనం రోజు రోజుకి పెరుగుపోతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. రైవాడ రిజర్వాయర్‌లో ప్రభుత్వం ప్రతిఏటా లక్షలాది చేపపిల్లలను విడుదల చేస్తుండడంతో దానిని ఆధాపడిన మత్స్యకారులు ఆ చేపలను వేటాడి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే కొంత మంది ప్రైవేటు వ్యాపారులు ప్రభుత్వ నిర్మించిన ఈ రిజర్వాయర్‌లో రొయ్యి పిల్లలను వేసి, రొయ్యిలను వేటాడి తెచ్చిన మత్స్యకారులు బయట అమ్ముకుండా, సదరు ప్రైవేటు వ్యక్తులకే వారు నిర్ణయించిన ధరకే విక్రయించే విధంగా ఒప్పందం చేసుకొని విచ్చల విడిగా వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకారులు కష్టపడి రిజర్వాయర్‌లో వేటాడి తెచ్చిన రొయ్యిలకు కేజీ రూ.200 ధర ఇచ్చి, బయట మార్కెట్‌లో వాటిని సైజును బట్టి రూ.350 నుండి రూ.500 వరకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రాజెక్టుపై ప్రైవేటు వ్యాపారులు పెత్తనం చేస్తుంటే మత్స్యశాఖ అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మత్స్యకారుల శ్రమను దోపిడీ చేస్తున్న ప్రైవేటు వ్యాపారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, దేవరాపల్లి మండలంలో అక్రమంగా చేపలు చెరువులు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిడిపిఒ శశికళ

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు బేటీ బచావో - బేటి పడావోపై కశింకోట బాలికలు హైస్కూల్‌లో శుక్ర వారం అవగాహన సదస్సు జరిగింది. ఇందులో ఐసిడిఎస్ సిడిపిఒ శశికళ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. 18 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం చేయాలని సూచించారు. 18 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహం చేస్తే చట్ట ప్రకారం రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని చెప్పారు. తల్లి దండ్రులు బాలికలకు ఉన్నత చదువులు చెప్పించి భవిష్యత్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ప్రియమణి, పి.సుచరిత, ఆదిలక్ష్మి, హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణ కుమారి , అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం సర్వనాశనం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని గొలగాం, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో శుక్రవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్లో ఉండాల్సిన ఖైదీలు పరిపాలన సాగిస్తే రాష్ట్రాన్ని దోచుకుంటారే తప్ప అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, నాయకులు తలారి కాశీనాయుడు, చీకటి రాంబాబు, మింది రాము, నారపిన్ని చంద్ర శేఖర్, తలారి నూకరాజు, బొండా నూకరాజు, అక్కిరెడ్డి రమణ బాబు, కర్రి రమణమ్మ, శివాజీ, కాశీ వరహాలు, పాల్గొన్నారు.

81వ వార్డులో ప్రచారం

జనసేన, బిజెపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం జివిఎంసి 81వ వార్డు నిదానం దొడ్డి ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేశారు. బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాడి వెంకట అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, సరిగడం సంతారం, కాండ్రేగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడులకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో శుక్రవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 30 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు.పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మాజీ సర్పంచ్ ఈగల

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈగల అప్పలనాయుడు గురువారం రాత్రి జనసేన పార్టీ చేరారు. ఆయనకు ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. విజయ్ కుమార్ గెలుపుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా అప్పలనాయుడు తెలిపారు.

జోరుగా టిడిపి ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12, 13 వార్డుల పరిధిలో సంతపాలెం, పైనాపిల్ కాలనీ, కామక్షినగర్ ప్రాంతాల్లో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలును వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, బుడుమూరు గోవిందు, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు, నమ్మి గణేష్, పాత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి పాల్గొన్నారు.

పిఎం పాలెం: భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విజయాన్ని కోరుతూ గంటా రవితేజ 6వ వార్డు పిఎం పాలెం గాయత్రి నగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గరె గురునాథ్ ఆధ్వర్యంలో గాయత్రినగర్ కాలనీలో ప్రచారంలో భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌లను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.. కార్యక్రమంలోజీవన్ ,శ్రావణ్, రెడ్డి సత్యన్నారాయణ, సంతోష్ నాయుడు, కె .రామకృష్ణ, బాబ్జీ, పోలిశెట్టి నాగేశ్వర రావు, పెంటకోట బబ్బేలు, కోరగంజి సూరిబాబు, పోతిన రమణ, పోతిన నాయుడు పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి కొణతాల బాబూరావు మృతి

ప్రజాశక్తి-అనకాపల్లి: టిడిపి సీనియర్ నాయకులు, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కొణతాల బాబురావు శుక్రవారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అంతిమయాత్రలో బాబురావు పాడి మోసి వారితో ఉన్న పరిచయాలు గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు. వందలాదిమంది పాల్గొన్న అంతిమయాత్రలో అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, గౌరీ సంఘం పెద్దలు బుద్ధ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



బాబూరావు (ఫైల్‌ఫొటో)

గ్రామాల్లో వైసిపి అభ్యర్థుల ప్రచారం


ప్రచారం చేపడుతున్న అనురాధ

ప్రజాశక్తి -చీడికాడ:మాడుగుల నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్ల అనురాధ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. మండల కేంద్రంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పరవాడ మహేష్, మండల కన్వీనర్ గొలవెల్లి రాజబాబు, మండల పరిషత్ అధ్యక్షులు కురచ జయమ్మ, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మిలతో కలిసి ఇంటింటికి అనురాధ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధర్మిశెట్టి స్వాతి, కిమిడి చిన్నమ్మలు, నాయకులు నారాయణమూర్తి, జానకి రామ్, చైతన్య, సర్పంచులు ఎంపిటిసీలు పాల్గొన్నారు.

కోటవురట్ల:పాయకరావుపేట వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం అన్నవరం, ఎండపల్లి, సుంకుపూరు, సచివాలయ పరిధిలోని గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా అదే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల వ్యాప్తంగా వైసిపికి ప్రజలు ఆదరణ చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు కే శ్రీనివాసరావు, డివి సూర్యనారాయణరాజు, మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు, సర్పంచ్, ఎంపిటిసీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:సంక్షేమం, అభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. శుక్రవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 1, 2 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ తమకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో మరో సారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, ఒకటో వార్డు ఇంచార్జ్ నల్లబెల్లి రామకృష్ణ, కౌన్సిలర్లు, టౌన్ వైసీపీ అధ్యక్షులు ఏకా శివ, డాక్టర్ లక్ష్మీకాంత్, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కోటవురట్ల మండలంలో ప్రచారం చేస్తున్న జోగులు


నర్సీపట్నంలో గణేష్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు


సత్కరిస్తున్న అర్చకులు

భజన కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయంలో పలు గ్రామాల నుండి వచ్చిన భజన బృందం కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సప్తహం శుక్రవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. అగనంపూడి నుండి శ్రీ సప్తస్వర భక్తి గీతాంజలి ఆర్గనైజర్లు మంజు, మన్మధరావు ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. భజన బృందం సభ్యులను వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు ఘనంగా సత్కరించారు. భజన బృంద గురువులను జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసా భజన భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.


జల్లూరు వంతెన ఇదే..

కలగానే జల్లూరు వంతెన నిర్మాణం

ప్రజాశక్తి -కోటవురట్ల:వరాహ నదిపై గత ప్రభుత్వం దాదాపు ఐదు కోట్లతో నిర్మించి అసంపూర్తిగా నిలిచిన వంతెన నాటి నుంచి నేటి వరకు కలగానే మిగిలి పోయింది ఎన్నిసార్లు స్థానికులు అధికారులకు, నాయకులకు ఫిర్యాదులు చేసినా, మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులు వంతెన కూలిపోతుందని ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసి వంతెన పనులు మొదలుపెట్టారు. దాదాపు వంతెన పనులు పూర్తయ్యాయి. వంతెన పైకి సమీపించే (అప్రోచ్) రోడ్డు నిర్మాణం చేపట్ట లేకపోయారు. డైవర్షన్ రోడ్డుకు సైతం సుమారు 50 లక్షలు ఖర్చు చేశారు. అది కూడా నీటన కలిసి పోయింది. ప్రస్తుతం జీర్ణావస్థలో ఉన్న వంతెన పై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు వంతెన పైనున్న గోతులు కారణంగా ఊగిపోతుంది. వంతెన పై ఉన్న రైలింగ్ సైతం నది వైపు ఒరిగి పోవడంతో ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ప్రయాణికులు ఆందోళన చేస్తున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. విద్యార్థులు తిరిగి ఇళ్లకు చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రెల్లిలకు గుర్తింపు ఏదీ?

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రెల్లిలను రాజకీయ పార్టీలు గుర్తించ లేదని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అమరావతిలో ఈ నెల 9న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు దళిత సంఘాల భేటీలో మాల మాదిగలు ఆయనకు రెండు కళ్ళు అన్నారని, ఎస్సీలో ఉన్న రెల్లిలు చంద్రబాబుకు గుర్తు లేరా, రెల్లిలు ఎస్సీలు కాదా అని ప్రశ్నించారు. రెల్లిలను కేవలం ఓట్ల కోసమేనా అన్నారు. రాష్ట్రంలో రెల్లి కులస్తుల కుటుంబాలు 30లక్షలు ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు గుర్తించక పోవడం బాధాకరమన్నారు. రెల్లిలు అన్ని రంగాలలో వెనుకబడ్డామని ఇది తెలిసి కూడా ప్రభుత్వాలు తమ గోడు పట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. రెల్లిలంతా ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.


దాడులు చేస్తున్న పోలీసులు

నాటు సారా బట్టీపై దాడి

గొలుగొండ: మండలంలోని అనంతసాగరం గ్రామ శివారులో శుక్రవారం నాటు సారా బట్టిపై దాడి చేసినట్లు గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని చెప్పారు.

గొలుగొండ:మండలంలోని సరుగుడు గ్రామ శివారులో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించినట్లు గొలుగొండ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఎస్సై రహీం తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా విక్రయాలు, తయారు చేసినా సమాచారం ఇవ్వా లన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి:స్థానిక బస్ స్టాప్ వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక సిపిఎం సర్పంచ్ సోమ్మెల రూతు, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రూతు మాట్లాడుతూ, ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో టోపీ ధరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శెట్టి బాలకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, ఉప సర్పంచ్ పి.అర్జున్, వార్డు మెంబర్ చిటం వెంకటరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

14న ప్రజాగళం యాత్రను జయప్రదం చేయాలి

- కూటమి అభ్యర్థి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేటలో ఈనెల 14న తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తలపెట్టిన ప్రజాగళం యాత్రను విజయవంతం చేయాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లోని ఆమె స్వగృహం వద్ద శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనిత మాట్లాడుతూ, ప్రజా గళం యాత్రకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం ఇన్చార్జి గెడ్డం బుజ్జి, సీఎం రాజేష్, పరుచూరి భాస్కర్, బుద్ధ నాగ జగదీష్, తోట నగేష్, బిజెపి పార్టీ ఇన్చార్జ్ రవి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను యలమంచిలి డివిజన్ డిప్యూటీ డిఈఓ పి.అప్పారావు శుక్రవారం సందర్శించారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగ భూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సందర్శిస్తున్న డిప్యూటీ డిఇఒ

మన్యంలో ఇటుకల పండగ ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీలో ఇటుకల పండగ ప్రారంభమైంది. ఈ పండుగను గిరిజనులు ప్రాంతాల వారీగా నెలరోజుల పాటు జరుపుకుంటారు. మండలంలో శుక్రవారం కురిడి, జంగిడి వలస ప్రాంత గ్రామల్లో పండగను జరుపుకున్నారు. గిరిజన సంప్రదాయబద్ధంగా గిరి మహిళలు అరకు, పాడేరు ప్రధాన 516ఇ హైవే రోడ్డుపైన జంగిడి వలస, కురిడి గ్రామ మహిళలు తాళ్లతో గేట్లు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారుల నుంచి పజోర్ (చందా) వసూళ్ళు చేశారు. ఈ విధంగా వసూలు చేయడం గిరిజనుల సాంప్రదాయం. ఈ విధంగా వారం రోజులు పాటు చందా వసూలు చేసిన డబ్బులతో గిరి మహిళలు సరదాగా ఏదో వస్తువులు కొనుగోలు చేసు కుంటారు. సుమారు నెలల రోజులపాటు గిరిజన గ్రామాల్లో పండగ సందడి ఉంటుంది.


చందాలు వసూలు చేస్తున్న మహిళలు


ఐక్య ప్రకటన చేస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం జరిగింది. విఘ్నేశ్వర అసోసియేషన్ అధ్యక్షుడు సాడి రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బూస రమణ, సెక్రటరీ చెన్నా నర్సింగరావు, జాయింట్ సెక్రెటరీ పల్లంటి జనార్ధన్, ట్రెజరర్ తాటిచెట్టి మోహన్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆనందపురం ప్రెసిడెంట్ సాడి రమేష్‌రెడ్డి, భీమిలి చైతన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ కె గురయ్యారెడ్డి, చిప్పాడ, గుడివాడ అసోసియేషన్‌ల అధ్యక్షులు సూరిబాబు, రవిశంకర్ మాట్లాడుతూ, మాజీ సైనికులంతా క్రమశిక్షణతో రాజకీయాలకు అతీతంగా ఉండాలని, అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సమిష్టిగా పోరాడాలని నిర్ణయించారు. మాజీ సైనికుల అసోసియేషన్ కార్యాలయానికి స్థలం, ఇతర సమస్యలు పరిష్కరించే పార్టీకి సహకరించాలని నిర్ణయించారు.

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

ఇంటర్ ఫలితాల్లో అనకాపల్లి జిల్లాలోని విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచారు.

కోటవురట్ల:ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించగా మొదటి సంవత్సరం విద్యార్థులు 89.9 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రాజెక్టు అధికారి సరితా దేవి తెలిపారు. జూనియర్ కళాశాలలో మిశ్రమ ఫలితాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. కళాశాలలో బైపీసీ చదువుతున్న ఇమ్మిడిశెట్టి నికిత 920 మార్కులు సాధించింది. అదేవిధంగా పాములవాక ఎస్ఎస్‌వి ప్రైవేటు కళాశాల విద్యార్థిని ఏ వాణిశ్రీ 917 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సాయికుమార్ తెలిపారు.



వాణిశ్రీ (917)

గురుకుల, కస్తూర్బా విద్యార్థుల ప్రభంజనం



అనూష భాగ్యశ్రీ భవాని ప్రేమాన్విత

నక్కపల్లి:మండలంలోని గురుకులం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత ఫలితాలు సాధించారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ ద్వితీయ పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. ఈ మేరకు గురుకులం ప్రిన్సిపల్ కెఎస్ఆర్ కుమారి మాట్లాడుతూ, ఇంటర్ ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 62 మంది పరీక్షలు రాయగా 52 మంది పాసైనట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 51 మంది బాలికలు పరీక్షలు రాయగా, 42 మంది పాసైనట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బోడపాటి అనూష (ఎంపీసీ - 881), గుల్లా మల్లిక (బైపిసి-937) మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి జే.భాగ్యశ్రీ (ఎంపీసీ -403), పూజారి ప్రేమాన్విత (బైపిసి-414)మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ షేక్ షలీమా మాట్లాడుతూ, ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 26 మంది పరీక్ష రాయగా 17 మంది పాసైనట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 32 మందికి 26 మంది పాసైనట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో జి విజయలక్ష్మి (బైపీసీ- 951), ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పి.భవాని (బైపిసి- 430) మార్కులు సాధించారని వెల్లడించారు.



ప్రతిభ చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

శ్రీ ప్రకాష్ విజయభేరి

పాయకరావుపేట:స్థానిక శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎం.పి.సి ద్వితీయ సంవత్సరం టి. వెన్నెల 982, డిడి సాయి శ్రీనివాస్ 980 మార్కులు, బై.పి.సి ద్వితీయ సంవత్సరంలో కే.లాస్య నందిని 979 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఎం.పి.సి ప్రథమ సంవత్సరంలో డి.వి.ఎల్ సాయి నిహారిక 464/470, ఎస్. మేఘన 463/470 మార్కులతో సత్తాచాటారు. బై.పి.సి ప్రథమ సంవత్సరంలో జి.వర్షిణి 428/440 మార్కులు సాధించారు.ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి. హెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సి.హెచ్. వి.కే. నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్తకోట:ఇంటర్ ఫలితాల్లో రావికమతం మండలం గర్నికం కెజిబివి, మరుపాక ఏపీ మోడల్ స్కూల్ 89 శాతం, కొత్తకోట జూనియర్ కాలేజికి 56.5శాతం ఫలితాలు సాధించాయి. మోడల్ స్కూల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 101 మంది హాజరు కాగా 90 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో గర్నికం కెజిబివి విద్యార్థిని ఎస్.జస్మిత 934 మార్కులు, మరుపాక మోడల్ స్కూల్ ద్వితీయ సంవత్సరం బైపిసి విద్యార్థిని పచ్చికూర రేవతి 932 మార్కులు సాధించి టాపర్లుగా నిలవగా కొత్తకోట జూనియర్ కాలేజిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 23 మందికి 13 మంది పాసయ్యారు. వీరిలో బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పద్మశ్రీ 913 మార్కులతో, ఎంపిసి విద్యార్థిని హారిక 910 మార్కులతో టాపర్లుగా నిలిచారని ఆయా కాలేజిల ప్రిన్సిపాల్ సత్య సునీల్, సత్యవతి శ్రావణ్ తెలిపారు.



నర్సీపట్నంలో అభినందిస్తున్న ఎబిఎం కాలేజీ అధ్యాపకులు

ఏబిఎం కళాశాల విద్యార్థుల సత్తా

అనకాపల్లిడెస్క్: ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాల్లో నర్సీపట్నం ఏబిఎం జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాలల విద్యార్థులు అధిక మార్కులు సాధించి సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో కె.కామాక్షి(418/440), సీహెచ్.వెంకట్(375/440, ఎం.రమ్య(373/440), పివిఎస్.భారతి(349/440), ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పి.చంద్ర తేజస్విని (979/1000), బి.భార్గవి(951), బి.దుర్గాగణేష్ బైపీసీ 935, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ ఎల్ఎంఅండ్‌డిలో ఇ.జాహ్నవి(484/500), జి.చిన్ని(475/500), కె.లహరి (455), పి.రామలక్ష్మి(455, ద్వితీయ సంవత్సరం ఎల్ఎం అండ్‌డిలో బి.లీలామంగవతి (914/1000), ఎస్.చంద్రకళ (902)లు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అంకంరెడ్డి గిరిబాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్(జనరల్), ఎన్.రామకృష్ణ(ఒకేషనల్) తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సత్తా చాటిన కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని తేగాడ గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్మీడియట్ విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం బైపిసి గ్రూపులో 29 మంది పరీక్షలకు హాజరు కాగా, 29 మంది పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కెజిబివి ప్రిన్సిపల్ డి.చంద్రకళ తెలిపారు. ప్రథమ ఇంటర్‌లో కె.రాజులమ్మ 429/440 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 22 మంది హాజరుకాగా 16 మంది పాసై 73శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ద్వితీయ సంవత్సరంలో బి.తేజశ్రీ 926/1000 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.



రాజులమ్మ

మోడల్ స్కూల్ విద్యార్థులు

మండలంలోని త్యాగాడ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ మార్త తిలకం తెలిపారు. ప్రథమ ఇంటర్‌లో అనన్య రత్నం, ఎస్ తేజస్వనీ, వి పూజిత, ఎస్ స్రవంతి, ద్వితీయ ఇంటర్‌లో జె.చంద్ర వేణి, రూప, అఖిలేశ్వరి, దేవి అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

దేవరాపల్లి : మండలంలోని బేతపూడి కేజీబీవీ నుండి ప్రథమ ఇంటర్ పరీక్షలకు 29 మందిల హాజరుకాగా 19 మంది పాసై 80 శాతం, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 11 మందిలో 8 మంది పాసై 73శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ఎస్ఓ సిహెచ్ భువన మాధురి తెలిపారు. ఫస్ట్ ఇంటర్‌లో డి.అనిత 453, జి.దివ్య 443, కె.రమ్యగీత 435 మార్కులు సాధించగా, ద్వితీయ ఇంటర్‌లో పి. కుమారి 791, బి.అచ్యుత 768, కె గంగోత్రి 733 మార్కులు సాధించినట్లు ఎస్ఓ వివరించారు. వారికి ఆమె అభినందనలు తెలిపారు. మండలంలోని తెనుగుపూడి గురుకుల బాలుర కళాశాలలో మొదట సంవత్సరం విద్యార్థులు 18 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 42 శాతం ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.రవీంద్రనాథ్ తెలిపారు. ద్వితీయ ఇంటర్‌లో ఎస్ కార్తీక్ 967 మార్కులు, ఫస్ట్ ఇంటర్‌లో కె.మనోజ్ కుమార్ 463 మార్కులు సాధించినట్లు చెప్పారు.



అచ్యుతాపురంలో ప్రతిభ చాటిన క్రైస్ట్ విద్యార్థులు

గురుకులం విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణత

సబ్బవరం : స్థానిక డాక్టర్ అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సిహెచ్‌వివి సత్యారావు తెలిపారు. ద్వితీయ ఇంటర్‌లో 20 మంది పరీక్షకు హాజరు కాగా 20 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంఇసి గ్రూపులో జి.ప్రవీణ్ కుమార్ 853 మార్కులు, సీఈసీలో డి అర్జున్ 888 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానాల్లో నిలిచాడు. ఫస్ట్ ఇంటర్‌లో సీఈసీ, ఎంఇసి గ్రూపులకు చెందిన 18 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఎంఇసి విద్యార్థి ఎస్ జస్వంత్ 395 మార్కులు సాధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన అయ్యన్న విద్యార్థులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక అయ్యన్న జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ద్వితీయ ఇంటర్‌లో 41మంది విద్యార్థులకు గాను 38మంది పాసై 93శాతం, ప్రథమ ఇంటర్‌లో 57 మందికి గాను 38 మంది పాసై 67శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ బైపీసీ, ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) విభాగంలో విస్సారపు అనూష-935 మార్కులు, మాదిబోయిన శ్రావ్య 910, వేపాడ శ్రీలేఖ 908 మార్కులు సాధించారు. ఎంపిసిలో సమ్మింగ దుర్గా 921 మార్కులు సాధించి కాలేజీ టాపర్స్‌గా నిలిచారు. ప్రథమ ఎంపీసీలో సీమసురు లక్ష్మణమ్మ 430 మార్కులు, చీపురుపల్లి యూసీ 413, బైపీసీ ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) విభాగంలో రెక్కి ధరణి 437, సమ్మింగ రమణమ్మ 427, దుక్క రేవతి 423 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారు. వీరికి అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం, అధ్యాపకులు, తల్లి దండ్రులు అభినందనలు తెలిపారు.

ఫస్ట్ ఇంటర్‌లో క్రైస్ట్ విద్యార్థి సుప్రియకు జిల్లా ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం క్రైస్ట్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థి పి.సుప్రియ 465 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. పి.నీలిమ 462, ఎల్ శ్రావణి 461, పి.హారిణి 461 మార్కులు సాధించారు. బైపిసిలో ఎం ప్రవల్లిక 423 మార్కులతో అచ్యుతాపురం మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ ఇంటర్‌లో కె.లక్ష్మీ ప్రసన్న 964, వై.భారతి 958, బి శ్రావణి 930, వై భారతి 921 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను క్రైస్ట్ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, డైరెక్టర్స్ రెడ్డి గణేష్, నెల్లూరి ప్రసాద్, అడిగర్ల శంకర్రావు అభినందించారు.

ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో అచ్యుత కళాశాల ముందంజ

అచ్యుతాపురం : ద్వితీయ ఇంటర్ ఫలితాలలో స్థానిక అచ్యుత జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎంపీసీ గ్రూపులో మెరుగ దుర్గాప్రసాద్ 975 మార్కులు, బైపిసిలో వంక నూకరత్నం 965, పిక్కి అర్పిత 962, సీఈసీలో చోడిపల్లి దేవి 894 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, ప్రిన్సిపల్ రాజాన సత్యనారాయణ తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల వారు అభినందించారు.

ఉషోదయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు

చోడవరం : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో చోడవరం ఉషోదయ విద్యాసంస్థల విద్యార్థులు మంచి మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ప్రథమ ఇంటర్ ఎంపీసీలో తుమ్మన లికిత 470కి 463 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. నేమాల జాహ్నవి 450, మోదీనా శ్యామల 458 సాధించారు. సెకండ్ ఇంటర్‌లో తుట్టగుంట భవ్యశ్రీ 1000కి 980, బైపీసీలో ఎలిశెట్టి యూసీ 961, వంటాకు అనూష 929, ఎంపీహెచ్‌డబ్ల్యులో పడాల పవిత్ర 958, కోడూరు పూజిత 949 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ జె రమణాజీ, కరెస్పాండెంట్ జె కృష్ణ కుమారి, డీన్ వెంకట వాసు అభినందించారు.

ఫస్ట్ ఇంటర్‌లో మహాలక్ష్మికి 466 మార్కులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్ష ఫలితాల్లో తుమ్మపాలకు చెందిన ఎంపిటిసి సభ్యులు పంచదార్ల కన్నారావు కుమార్తె మహాలక్ష్మి 470 మార్కులకుగాను 466 మార్కులు సాధించింది. మహాలక్ష్మి బోయపాలెం నారాయణ కళాశాలలో చదువుతోంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహాలక్ష్మిని తుమ్మపాల గ్రామ పెద్దలు అభినందించారు.



చోడవరంలో ప్రతిభ చాటిన విద్యార్థి

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివి ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎన్.జ్యోతి 956, ఎం.నాగమ్మ 953, పి.లత 942 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి కె.అన్నపూర్ణ తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎ.వెంకట పద్మ 410, కె.లోహిత 407 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఫస్ట్ ఇంటర్ పరీక్షలకు 37 మంది విద్యార్థులు హాజరుకాగా 27 మంది పాసై 72.9 శాతం, ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 34 మంది హాజరు కాగా, 31 మంది పాసై 92 శాతం ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఫస్ట్ ఇంటర్‌లో 70 మందికి 15 మంది, సెకండ్ ఇంటర్‌లో 65 మంది విద్యార్థులకు 30 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం తురకలపూడికి చెందిన గంటల సాయికుమార్ ప్రథమ ఇంటర్‌లో 470 గాను 463 మార్కులు సాధించాడు.



లత లోహిత జ్యోతి పద్మ జ్ఞానేశ్వరి నాగమ్మ